# ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబర్ 2023

5



అల్లూరి సీతారామరాజు


## మోదకొండమ్మ సన్నిధిలో సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని చాంద్రాయణగుట్ట (హైదరాబాద్) సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మల్లె శివ నాగరాజు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించు కోవడానికి వచ్చిన మల్లె శివ నాగరాజు కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శర్మ అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి మనంగా సత్కరించారు.



అమ్మవారి చిత్రపటాన్ని ఇస్తున్న సభ్యులు

## సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్

# ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

### - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు - ఐటిడిఎ ఎదుట వేడుకోలు దీక్ష



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి-పాడేరు:** సమగ్ర శిక్ష, కేజీబీవీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి విద్యా శాఖలో విలీనం చేయాలని సీఐటీయూ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అల్లూరి జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఐటీడీఏ ముందు సీఆర్పీలు, కేజీబీవీల టీచింగ్, నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు వేడుకోలు దీక్ష నిర్వహించారు. 11 మండలాల నుంచి వేడుకోలు దీక్షకు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల చిన్నచూపుగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉద్యోగులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. పోరాడుతున్న ఉద్యోగులను, కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో ఉద్యమాలను అణచి వేయాలని చూస్తుందని విమర్శించారు.తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష, కేజీబీవీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం పద్ధతి రద్దు చేసి ఫుల్ టైం ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. కరువు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటి కల్పించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి, పని భారం తగ్గించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేసి, జాబ్ చార్ట్, ప్రతినెలా ఒకటో తేదీ నాటికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఈ సందర్భంగా ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మండి అనిల్ కుమార్ మాట్లాడుతూ ధరలు రోజురోజుకు పెరుగుతున్న వేతనాల పెరగపోవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎదురుచూసిన ఫలితం లేకపోవడంతో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జయరాజ్ మాట్లాడుతూ భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగులందరూ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టిడిపి డివిజన్ నాయకులు, సర్పంచ్ పాండురంగ స్వామి మాట్లాడుతూ, ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శెట్టి నాగరాజు మాట్లాడుతూ, పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు.ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్.సుందరరావు మద్దతు ప్రకటించారు. ఈ వేడుకోలు దీక్షలో సిఆర్పీలు, కేజీబీవీల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, యూనియన్ కోశాధికారి పూజారి సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ సొలగం గౌరీ శంకర్, మహిళ కన్వీనర్ లోచల వీరభద్రమ్మ, ఇతర మండలాల ప్రతినిధులు వర్తన సుజాత, గడుతూరి ఈశ్వరరావు, శకుంతల, పి.రాంబాబు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జిలకు బ్యాంకు లింకేజీ, సున్నా వడ్డీ రుణాలు

### 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు ఏజెన్సీలోని 512 స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులకు, బ్యాంకు లింకేజీ కింద 2023-24 సంవత్సరానికి వివిధ బ్యాంకుల ద్వారా రూ.13.04 కోట్లు రుణాలు మంజూరైనట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి వెల్లడించారు. వైయస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 5,755 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.3.40 కోట్ల సున్నా వడ్డీ రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఏజెన్సీలో వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాటల్లోనే....






**సంఘాలు, సభ్యులు ఎందరున్నారు?**

ఏజెన్సీలోని 11 మండల మహిళా సమాఖ్యలలో 583 గ్రామ సంఘాల పరిధిలో 13173 స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) ఏర్పాటు చేశారు. వీటిలో 1,51,057 మంది మహిళా సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారు..

**ఎస్‌హెచ్‌జిలకు పథకాల అమలు**

వైయస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతలుగా 39,193 స్వయం సహాయక సంఘాలకు రూ.41.14 కోట్లు మంజూరు అయ్యాయి.వైయస్సార్ చేయూత పథకం ద్వారా 45 సంవత్సరాల నుండి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలకు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు) ఒక్కొక్కరికి రూ.75 వేల చొప్పున (నాలుగు విడతలలో) ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం మూడు విడతలుగా 31,837 మంది లబ్ధిదారులకు రూ.152. 86 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా 1,709 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులకు రూ, 7.67 కోట్లు మంజూరు అయ్యాయి.

**బీమా పథకానికి నమోదు.**

ఏజెన్సీలో వైయస్సార్ బీమా పథకం కింద 1, 51 వేల 799 మంది లబ్ధిదారులను నమోదు చేసాం.. ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 45 మంది చనిపోయిన వారిని గుర్తించి నమోదు చేశాం.

**సాధీతోఫా, కళ్యాణమస్తు వివరాలు**

ఏజెన్సీలో 2022 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు కళ్యాణమస్తు, సాధి తోఫా పథకాల కోసం 484 జంటలను నమోదు చేసాం. ఇందులో 129 మంది లబ్ధిదారులకు కోటి 30 లక్షల 60 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఏజెన్సీలో జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడతగా 1,704 మంది లబ్ధిదారులకు రూ.1,70 కోట్లు మంజూరు చేసాం..

**జిల్లాలో ఇస్తున్న పింఛన్లు**

వైయస్సార్ సామాజిక భద్రత పింఛన్ల పథకం కింద జిల్లాలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, అభయహస్తం మత్స్యకారులు, తదితర 75 వేల 120 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. పింఛన్ల పంపిణీ కోసం ప్రతి నెల 21.22 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

## రవణిని ప్రభుత్వాలు ఆదుకోవాలి


### బాలల హక్కుల పరిరక్షణ వేదిక

**ప్రజాశక్తి-హుకుంపేట:** అంధుల అంతర్జాతీయ క్రికెటర్ వలసనైని రవణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ కొర్రా అనంత కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని మెరకచింత పంచాయతీ రంగసింగ పాడు గ్రామంలో ఆదివారం ఆమె స్వగ్రామంలో సన్మానించి అబినందనలు తెలిపారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ కొర్రా అనంత కుమార్ మాట్లాడుతూ, అంధుల అంతర్జాతీయ క్రికెట్లో భారత్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన అదివాసీ ముద్దు బిడ్డ వలసనైని రవణి దేశానికి ఎంతో పేరు తీసుకొచ్చిందన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో చొరవ తీసుకొని రవణికి సహాయ సహకారాలు అందించాలన్నారు.సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ తరపున ఉన్నతాధికారులతో మాట్లాడి క్రీడా రంగంలో ప్రోత్సహించాలని ఆయన కోరారు. క్రీడారంగంలో అనేక మంది గిరిజన యువతీ యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడల్స్ సాధించినప్పటికీ గిరిజన యువతీ యువకులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజన క్రీడాకారులను గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు.



రవణిని అభినందిస్తున్న అనంత్‌కుమార్

## స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర తెలుసుకోవాలి




ద్వారబందాల చంద్రయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు, ఆదివారం మండలంలోని శరభవరం గ్రామంలో స్వాతంత్ర్య సమర యోధులు ద్వారబందాల చంద్రయ్య దొర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో బ్రిటిషర్ల బారి నుంచి గిరిజనులను రక్షించి, వారికి అండగా నిలిచిప మహనీయులలో ద్వారబంధాల చంద్రయ్య ఒకరన్నారు. ఇలాంటి సమరయోధుల చరిత్రను వెలుగులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. చంద్రయ్యదొర జీవితం భావితరాలకు స్పూర్తి దాయకమన్నారు. అనంతరం చంద్రయ్యదొర వంశస్తులను దుశ్శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, అల్లూరి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు, ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, రాజవొమ్మంగి సిఐ షేక్ బాజీలాల్, ఎస్ఐ టిజి.నరేంద్ర ప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## కూలిన వంతెన వద్ద పొంచి ఉన్న ప్రమాదం

- బిక్కుబిక్కుమంటూ వాహన రాకపోకలు
- భారీ మలుపు ఉండడంతో భయం భయం
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు వేడుకోలు
- ప్రమాద నియంత్రణ చర్యలకు వినతి



అన్నవరం వద్ద కూలిన పాత వంతెన

**ప్రజాశక్తి - విఆర్.పురం:** మండలంలోని రేఖపల్లి నుండి చింతూరు వెళ్లే ప్రధాన రహదారిలోని అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో ఉన్న కూలిపోయిన పాత బ్రిడ్జి వద్ద ప్రమాదం పొంచి ఉందని ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పాతబ్రిడ్జి కూలిపోవడంతో పక్కనే తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించినప్పటికీ, కూలిన వంతెన వద్ద అటుగా వెళ్లకుండా అవరోధాలుగానీ, హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో కొత్తగా వచ్చేవాళ్లుగానీ, రాత్రి వేళల్లో ప్రయాణించే వారు నేరుగా కూలిన వంతెనవైపు దూసుకుపోయి ప్రమాదానికి గురయ్యే ఆస్కారముందని అంటున్నారు.అంతేకాక కూలిన బ్రిడ్జివైపే నేరుగా ఉన్న రహదారికి, బ్రిడ్జి వద్ద పెద్దమలుపు తిప్పి, పక్కనే నిర్మించిన కాజ్‌వేకు అప్రోచ్ రోడ్డును వేశారు. వంతెనకు రెండు వైపులా ఇదే పరిస్థితి ఉంది. ఏమాత్రం ఆదమరిచి వచ్చిన వాహనదారులకు కూలిన వంతెన దగ్గరకు వచ్చేవరకు అక్కడ ప్రమాద పరిస్థితి తెలియదని, తెలిసేలోగానే కూలిన వంతెన వైపు దూసుకుపోయే ప్రమాదం పొంచి వుందని అంటున్నారు. రేఖపల్లి నుంచి చింతూరు వైపు, సుమారు 40 గ్రామాల ప్రజలు, వాహదారులకు ఈ రోడ్డు మార్గంలోనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.అంతేకాక ఇదే మార్గం రాజమండ్రి వెళ్లే వాహనాలకు ప్రధాన రహదారి కావడంతో వాహనరద్దీ కూడా ఎక్కువగానే ఉంటోందని స్థానికులు అంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి, అనుకోని నష్టం జరగముందే సంబంధిత అధికారులు స్పందించి కూలిన వంతెన వద్ద నేరుగా వెళ్లిపోకుండా మట్టితోనైనా గట్టు వేయడంతోపాటు అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నవరం ఉమ్మడివరం గ్రామ ప్రజలతోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదాలు జరగక ముందే స్పందించాలి



ఉమ్మడివరం వద్ద గెడ్డపై పాత వంతెన కూలిన చోట ప్రమాదం ఉంది. విఆర్.పురం వైపు నుంచి చింతూరు మీదుగా రాజమండ్రి వైపు వచ్చిపోయే వాహ నాలు ఇదే మార్గంలో రాక పోకలు సాగిస్తుంటాయి. వంతెన పక్కన నిర్మించిన కాజ్‌వేకు వేసిన అప్రోచ్ రోడ్డు వైపు వెళ్లాలంటే పెద్దమలుపు ఉండడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. కూలిన వంతెన వద్ద ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలి.

**బొగ్గ రవి, ఉమ్మడివరం గ్రామం, రేఖపల్లి పంచాయతీ**



కాజ్‌వే అప్రోచ్‌రోడ్డు వద్ద ప్రమాదంగా భారీ మలుపు

## 300 మందికి వైద్య సేవలు




రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

**ప్రజాశక్తి -రంపచోడవరం :** రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరానంద మహరాజ్ వైద్యశిబిరంలో పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు. డాక్టర్ గోలి వెంకటరామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ టి.వి.సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సంపత్‌కుమార్ పాల్గొని రోగులకు వైద్యసేవలు అందించారు. వీరిలో 95 మందికి రక్తపరీక్షలు, 9మందికి థైరాయిడ్ పరీక్షలు, ఎనిమిది మందికి ఇసిజిలు, 24మందికి ఎక్స్‌రేలు, ఏడుగురికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు.

ఈ సందర్భంగా వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి, 56మందికి కంటి పరీక్షలు చేశారు. 17మందికి కళ్లజోళ్లు, ఏడుగురిని కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కంటి ఆపరేషన్లకు వేమగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ ఎల్‌జిబి.భగీరథరాజు, ఉదయ్‌కిరణ్. మంగిరెడ్డి చంద్రం, చంద్రశేఖర్, వాణి గాధిరాజు, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజనాలను సమకూర్చారు.

## కొనసాగిన టిడిపి నిరసనలు



రంపచోడవరంలో నిరసనలో పాల్గొన్న టిడిపి నేతలు

**ప్రజాశక్తి -రంపచోడవరం :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో రంపచోడవరం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ముందుగా అంబేద్కర్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్ష శిబిరంలో మాజీ ఎమ్మెల్యేలు, వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు ఇతర ముఖ్యనేతలు కూర్చున్నారు. 11 మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**విఆర్ పురం:** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రేఖపల్లిలో టిడిపి నేతలు నిరాహారదీక్షలు చేపట్టారు. రేఖపల్లి వద్ద నిరసన దీక్షలో జెడ్‌పిటిసి వాళ్ల. రంగారెడ్డి ఎంపిటిసి వాళ్ల.కృష్ణారెడ్డి, మండల నాయకులు నరేష్, పాయం రామారావు మాట్లాడుతూ ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్టులు, వేధింపులకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికమని, వెంటనే బెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం గెలుస్తుందని, చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే వేధింపులు, అక్రమాలకు పాల్పడిన వారిని ఒక్కొక్కరినీ గుర్తుపెట్టుకుని అందరికీ రివర్స్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయమని హెచ్చరించారు. టిడిపి నేతలు పంకు. సత్తిబాబు, కారం. సుందరయ్య, లక్ష్మణరావు, చిక్కాల. రామారావు, సోడి. మల్లయ్య, తాతబాబు, ప్రకాష్, కాంతారావు, అధికసంఖ్యలో టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**రేఖపల్లిలో టిడిపి దీక్షలకు సిపిఎం సంఘీభావం**

కాగా దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు, ఎంపిపి కారం లక్ష్మి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు చంద్రబాబు అరెస్ట్ పరాకాష్టగా నిలిచిందన్నారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలు, నేతలు స్వేచ్ఛగా తిరగలేని స్థితి ఉందని, ఇంతటి దౌర్భాగ్యపు పాలన మునుపెన్నడూ లేదని మండిపడ్డారు.




అనంతగిరిలో టిడిపి, జనసేన నిరసనలు

**పెదబయలు:** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ అధ్యక్షురాలు సీకారి సుకుమారి అధ్యక్షతన బి ఆర్ అంబేద్కర్ కూడలి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ సోనే, మాజీ ఎంపీపీ కొండయ్య, తెలుగు యువత అధ్యక్షులు త్రినాథ్, నాయకులు సల్లంగి రవికుమార్ పాల్గొన్నారు.

**హుకుంపేట:** మండల కేంద్రంలోని బస్సు షెల్టర్ వద్ద టీడీపీ శ్రేణులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలం అధ్యక్షులు కొర్ర తులసిరావు, ప్రధాన కార్యదర్శి సిరగం సూర్యకాంతం, జిసిసి మాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, తాడిపుట్టు సర్పంచ్ సోమేలి సత్యవతి, గూడ సర్పంచ్ కంబిడి సరోజికుమారి, బి.తాడేపుట్టు సర్పంచ్ పాడి అచ్చులమ్మ, తెలుగు యువత అధ్యక్షులు పల్టా సింగి కామేశ్వరరావు, పార్లమెంట్ మహిళ నాయకురాలు సాగర సత్యవతి, యూనిట్ ఇన్చార్జిలు సోమేలి లక్ష్మయ్య, కంబిడి జ్ఞాన ప్రకాష్, పాడి బాలన్న, వెంకట్ పాల్గొన్నారు.



పెదబయలులో నిరసన దీక్షలో టిడిపి శ్రేణులు

**అనంతగిరి:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌పై ఆ పార్టీ మండల నాయకులు ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్ర గుహలు వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సర్పంచ్ జన్ని అప్పారావు, నాయకులు టి.ఆనంద్, జోగులు, లక్షణ్, సోమ తదితరులు పాల్గొన్నారు



ఛిద్రమైన రహదారి

## 'జియో' పనులతో రహదారులు ఛిద్రం

**ప్రజాశక్తి -జి.మాడుగుల:** మండలంలో సోలభం పంచాయతీ కంటవరం గ్రామం నుండి గొందిపాడు గ్రామానికి మధ్యలో జియో కేబుల్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా ఇష్టానుసారంగా తారు రోడ్డున సైతం తవ్వేస్తుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఒక మీటర్ అవతల కాలువ తీసి కేబుల్ పనులు నిర్వహించాలి. అలా కాకుండా రహదారికి పక్కనే తవ్వి రహదారిని సైతం శిథిలం చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు సైతం ఇష్టాను సారంగా పీకి పక్కన పడేస్తున్నారు. శిథిలమైన రహదారుల గుంతల్లో నడవడే కష్టమవుతుందని ఇంకా శిథిలం చేస్తే ఎలా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షాలు పడితే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కాంట్రాక్టర్‌ని ఇదేమి దారుణమని అడిగితే సెల్ టవర్ కావాలంటే రోడ్డు పోతుంది మరి అంతే అని సమాధానం ఇవ్వడం విశేషం.సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రహదారులు శిథిలం కాకుండా జియో పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కళా సాహితీ సంస్థ ఏర్పాటు

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** కళలను, సాహిత్యాన్ని స్థానికంగా మరింతగా విస్తరించేందుకు కళా సాహితీ సంస్థను ఏర్పాటు చేసినట్లు రచయిత రాజేంద్ర ప్రసాద్‌వర్మ తెలిపారు. స్థానిక చిన్న బజారులోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం పలువురు కళాకారులు, కళాభిమానులతో సమావేశం నిర్వహించారు. ప్రాచీన కళలను నేటి తరానికి పరిచయం చేస్తూనే, పేద కళాకారులను అన్ని విధాలా ప్రోత్సహించనున్నట్లు వర్మ వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.అప్పలనరసయ్య, అధ్యక్షులుగా పిఆర్‌పి.వర్మ, కార్యదర్శిగా ఎ.సన్యాసిరాజు, కోశాధికారిగా, కాళ్ళ సన్నీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.సూర్యశ్రీనివాస్, సలహాదారులుగా కె.రమానాయుడు, పిట్టా సురేష్ ఎన్నికయ్యారు. అలానే కళలు, సాహిత్యం, నృత్యం ఇలా విభాగాల వారీగా ప్రతినిధులను ఎన్నుకున్నారు.

## ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ప్రకృతి వనరులను కాపాడుకోవాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక కెజిబివిలో ఆదివారం గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యాన మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. 21 వినాయక పత్రి మొక్కలను పెంచుదాం, ఏకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం అని ఉపాధ్యాయులు, విద్యార్థులు నినదించారు. ఈ సందర్భంగా జెవి.రత్నం మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ప్రతిమల వల్ల మానవాళికి, జీవ వైవిధ్యానికి హాని కలుగుతుందన్నారు. భారత కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల ప్రకారం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోగాని, కెమికల్ పెయింట్లతోగాని ప్రతిమలను రూపొందించరాదని తెలిపారు. గాలి, నీరు, భూమిని ఆరోగ్యకరంగా ఉంచితే మనం కూడా ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధులు రాజేశ్వరి, రవితేజ, ప్రిన్సిపల్ గంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్..

# ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం

**ప్రజాశక్తి-పాడేరుటౌన్:** విద్యారంగాభివృద్ధికి, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి విద్యాశాఖకు వారధిగా నిలుస్తూ.. పేద పిల్లలకు బోధిస్తున్న జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష, కెజిబివిలలో అల్లూరి జిల్లా వ్యాప్తంగా 856, రాష్ట్ర వ్యాప్తంగా 26,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తాం.. అని ఓదార్పు యాత్రలో తనను కలిసిన ఉద్యోగులతో సిఎం జగన్ మాట ఇచ్చి మరిచారని వారు వాపోయారు.అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల అర్హత, సర్వీసును పరిగణలోకి తీసుకొని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేస్తామని 2019 నాటి ఎన్నికల మ్యానిఫెస్టోలో వైసిపి పేర్కొంది. 2 జూన్ 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని మంత్రివర్గం తీర్మానం చేసింది. ఇది చరిత్రాత్మక నిర్ణయం అంటూ 2023 జులైలో జరిగిన క్యాబినెట్ తర్వాత ప్రభుత్వం ప్రకటన చేసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలైనా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకిచ్చిన హామీలను ఈరోజు వరకు వాటిని సక్రమంగా అమలు చేయలేదు. సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆశలు అడియాసలవ్వడంతో నిరాశలో ఉన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎటువంటి భద్రతా లేకుండా విధులు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

**ఇవి డిమాండ్స్..**

సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. మినిమం టైం స్కేల్ తో వేతనాలు పెంచాలి. ఫుల్ టైం కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలి, కరువు భత్యం, ఇంటి అద్దె, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి. పదవి విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్, మెరుగైన హెల్త్ స్కీమ్ అమలు చేయాలి. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి, కారుణ్య నియామకాలు చేపట్టాలి. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు, అన్ని పోస్టులకు జాబ్ చార్ట్ ఇవ్వాలి. ఒకటో తేదీ నాటికి వేతనాలు, సంవత్సరానికి సరిపడ బడ్జెట్ ఒకేసారి ఇవ్వాలి.

### పర్మినెంట్ చేయాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. రాష్ట్రంలో కాంట్రాక్ట్ వ్యవస్థ లేని విధానాన్ని తెస్తామని, కాంట్రాక్ట్ ఉద్యోగులను, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 2014 ముందున్న వారికే రెగ్యులర్ అనే నిబంధన పెట్టడం తగదు. ఈ విధానంతో కేవలం కొద్ది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది.



**వి.జయరాజు**
**జిల్లా ప్రధాన కార్యదర్శి**
**సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్**

### సమస్యలు పరిష్కరించాలి

సమగ్ర శిక్ష, కెజిబివిలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. సమగ్ర శిక్ష, కెజిబివిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అందించాలి. ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం ప్రభుత్వం తీసుకున్న చర్య రాష్ట్రంలో లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేయడమే. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే మినిమం టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.



**ఎం.అనిల్ కుమార్**
**జిల్లా అధ్యక్షులు**
**సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్**

# పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్ ప్రారంభం

**ప్రజాశక్తి -మధురవాడ :** డిఆర్‌డిఒ సహకారంతో పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎకో వైజాగ్‌కు మద్దతుగా ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి నాంది పలికిందన్నారు. విశాఖలో ఇప్పటికే ప్లాస్టిక్‌ను నివారించడానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని, వాటి ఫలితంగా అనేక అవార్డులు కూడా వచ్చాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సాగరంలో కొన్ని వేల టన్నులు చెత్త పేరుకుపోతోందని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలను దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కంపెనీ సిఇఒ వి.పేరప్రసాద్, డిఆర్‌డిఒ ప్రాజెక్టు డైరెక్టర్, సైంటిస్ట్ ఎఫ్‌కె.వీరబ్రహ్మం, మాజీ డిప్యూటీ మేయర్ దొరబాబు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

# నేరాలు ఘోరాలు

## బాలికపై లైంగిక దాడి

**ప్రజాశక్తి-పెందుర్తి :** జివిఎంసి 96వ వార్డు పరిధి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్.కాలనీలో ఐదేళ్ల బాలికపై అభిషేక్ (18) అలియాస్ నాని అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో పైబ్లాకు, కింది బ్లాకుల్లో నిందితుడు, బాలిక కుటుంబాలు నివసిస్తున్నాయి. తల్లిదండ్రులు ఇంటికి వచ్చాక అభిషేక్ ఇలా చేశాడని బాలిక చెప్పింది. దీంతో అత్యాచారం జరిగినట్లు తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. నిందితుడు అభిషేక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను కెజిహెచ్‌కు పంపినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. వైద్య పరీక్షల రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

## యువకుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి -గాజువాక :** న్యూపోర్టు పోలీసుస్టేషన్ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. నడుపూరుకు చెందిన పీత గౌరీశ్వర్‌కుమార్ (25) నగరంలోని ఒక ప్రయివేటు బ్యాంకులో ఇంటి పత్రాలను తనఖా పెట్టి రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పుకు సంబంధించి ఆగస్టు నెలలో ఇఎమ్ఐ చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు ఇంటికి వచ్చి రెండు రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పెదగంట్యాడలోని ఒక హోటల్‌కు వెళ్లి గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు మృతితో తల్లి లక్ష్మి బోరున విలపిస్తున్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** కుంబిడిసింగి పంచాయతీ అండంగిసింగి గ్రామ సమీపంలో జియో సెల్ టవర్ వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా దక్కిటెద్దు ఆదివారం మృత్యువాత పడింది. గద్దెరాయి గ్రామానికి చెందిన గిరిజన రైతు వంతాల పద్మనాభం కు చెందిన దక్కిటెద్దు మృతి చెందడంతో లబోదిబోమన్నాడు. విషయం తెలుసుకున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జె.దీనబంధు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఎద్దు విలువ రూ.35 వేలు ఉంటుందన్నారు. దీనబంధు మాట్లాడుతూ, జియో సెల్ టవర్ ఏర్పాటు చేసిన పుడు ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసుంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. టవర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఎద్దు మృతి చెందిందన్నారు. ఈ ఘటన పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం 50 వేల రూపాయలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.



మృతిచెందిన ఎద్దు

## 15న అగ్రిగోల్డ్ బాధితుల చలో విజయవాడ

**ప్రజాశక్తి -ఆనందపురం :** అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాటానికి ఈ నెల 15 విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వస్తున్నట్లు ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆనందపురం కూడలిలో ఆదివారం చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ ఏజెంట్‌లు కోరాడ ఆదినారాయణ, సన్యాసిరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 లక్షల మంది కష్టార్జితాన్ని అగ్రిగోల్డ్ గజ దొంగలు దోచుకున్నారన్నారు. వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని మాట ఇచ్చి నేడు మడమ తిప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. అనందపురం మండలంలో సుమారు పదివేల మంది బాధితులు సుమారు రూ.3 కోట్లు పైన అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ఈ 15న విజయవాడలో జరుగే భారీ బహిరంగ సభకు బాధితులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు మీసాల నర్సింగరావు, బాలి రవికుమార్, దొంతల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మ్యూజిక్ అకాడమీని ప్రారంభిస్తున్న ఆర్‌పి పట్నాయక్

## విశాఖలో ముజిగల్ మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** దేశంలో అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్‌గా ఉన్న ముజిగల్ తమ తొమ్మిదో అత్యాధునిక సంగీత అకాడమీని ఆదివారం విశాఖలోని ఎంవిపి డబుల్ రోడ్డులో ప్రారంభించింది. ఈ అకాడమీని సంగీత దర్శకుడు, గాయకుడు, సినీ దర్శకుడు ఆర్‌పి.పట్నాయక్, ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి ప్రారంభించారు. దాదాపు రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ అకాడమీ అన్ని సౌకర్యాలనూ కలిగి ఉంది. గాత్రం, వాయిద్యంతో సహా సంగీతం నేర్చుకోవడానికి అత్యంత అనుకూలమైనదిగా రూపొందించబడింది. అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథి ఆర్‌పి.పట్నాయక్ మాట్లాడుతూ సంగీతాన్ని అందరికీ చేరువ చేయాలనే మహోన్నత లక్ష్యంతో ముజిగల్ సంస్థ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. భారతీయ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీతంలో విస్తృత శ్రేణి కోర్సులను అందిస్తోందన్నారు. ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి మాట్లాడుతూ భారతదేశంతో పాటు యుఎస్ఎ, యుకె, ఆస్ట్రేలియా, యుఎఇలలో 10 వేల మంది విద్యార్థులకు 400కు పైగా సుశిక్షితులైన సంగీత టీచర్లు సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 40 వేల తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్ కుమార్

## విశాఖ డిఆర్‌ఒగా మోహన్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ)గా కె.మోహన్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారిగా ఉన్న ఆయన్ని విశాఖ జిల్లా రెవిన్యూ అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన ఆదివారం విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

## వైభవంగా కొప్పరపు కవుల కళాపీఠం వేడుక

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం 21 వసంతాల వేడుక శనివారం సాయంత్రం లలితానగర్‌లోని లలితా పీఠంలో వైభవంగా జరిగింది. ఆ మహాకవుల మనుమడు, పీఠం వ్యవస్థాపకులు, ప్రముఖ పాత్రికేయులు మాచవరం వెంకట చెంచురామ మారుతీ సుబ్బరాయ శర్మ (మాశర్మ) సారథ్యంలో కార్యక్రమం సాగింది. ప్రతిపదార్థ, తాత్పర్య, విశేష వ్యాఖ్యాసహిత కొప్పరపు కవుల 'దైవసంకల్పము' కావ్యాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఆవిష్కరించి తొలి ప్రతిని శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ పురస్కార గ్రహీత కెవి.వరప్రసాద్ రెడ్డికి అందజేశారు.

# జి-20 సమ్మిట్‌లో అరకు కాఫీ ఘుమఘుమలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** న్యూఢిల్లీలో జరుగుతున్న జి - 20 సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జిసిసి) అరకు వ్యాలీ కాఫీ ఘుమఘుమలాడుతోంది. అగ్ర దేశాల అధినేతలంతా పాల్గొంటున్న ఈ సమ్మిట్‌లో అరకు కాఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన రైతులు పండించిన కాఫీని అక్కడి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. అరకు కాఫీలో నాణ్యత, కాఫీ సాగులో స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన పద్ధతులను అక్కడి వాలంటీర్లు సందర్శకులకు వివరిస్తున్నారు. తాజా ప్రదర్శన అంతర్జాతీయ మార్కెట్‌లో జిసిసి అరకు వ్యాలీ కాఫీకి కొత్త మార్గాలను తెచ్చిపెడుతుందని పలువురు భావిస్తున్నారు. ప్రపంచ దేశాలకు మన గిరిజనులు పండించిన అరకు కాఫీ రుచులను పరిచయం చేయడం సంతోషంగా ఉందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు అవకాశమిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన అరకు కాఫీ ఉత్పత్తులు

# రోజా కన్నన్‌కు సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి శాస్త్రీయ నృత్యోత్సవాలకు వేళైంది. దీనిలో కలికితురాయిగా నిలిచే వైశాఖి నృత్యోత్సవం-2023 ఈ నెల 15, 16, 17 తేదీలలో కళాభారతి ఆడిటోరియంలో జరుగనుంది. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నాట్యరంగ నిష్ణాతులకిచ్చే వైశాఖి ఎక్స్‌లెన్సీ అవార్డుల వివరాలను ఫెస్టివల్ డైరెక్టర్, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బిఆర్.విక్రమ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు - 2023కు తమిళనాడుకు చెందిన సుప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి, ఆచార్య చూడామణి అవార్డు గ్రహీత రోజా కన్నన్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఆమె తన బృందంతో వైశాఖి ఉత్సవాల తొలిరోజైన 15వ తేదీ సాయంత్రం ప్రదర్శన ఇవ్వనున్నట్టు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన భరతనాట్య కళాకారిణి డాక్టర్ ఉమా రేలే వైశాఖి ఎక్స్‌లెన్స్ జాతీయ పురస్కారానికి ఎంపికవగా ఉమా, నలందా బృందంతో కలసి ఉత్సవాల రెండో రోజైన 16వ తేదీ సాయంత్రం ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ నేషనల్ యువ పురస్కారాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి నాట్యశ్రీ బిరుదాంకితురాలు సూడగాని గీతా నారాయణ్, హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్‌లను తమ నిపుణుల కమిటీ ఎంపిక చేసినట్టు వెల్లడించారు.




నాట్యకారిణి
రోజా కన్నన్ (ఫైల్‌ఫొటో)

# మహిళా మనోవికాస్ పనితీరు భేష్




గిన్నిస్ రికార్డు ధ్రువీకరణపత్రంతో సంస్థ ప్రతినిధులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** మహిళా సాధికారత, మహిళాభ్యుదయమే ధ్యేయంగా మహిళలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మహిళా మనోవికాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ రేణుక రాణి కొనియాడారు. మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు సూరిబట్ల మాధవి బృందం అత్యధిక సంఖ్యలో క్రోచెట్ పోంచోస్‌లను ప్రప్రథమంగా ప్రపంచంలో తయారు చేసి గిన్నిస్ రికార్డ్ సాధించిన సందర్భంగా నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్రోచెట్ పోంచో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణుక రాణి, ప్రత్యేక అతిథులుగా హాజరైన ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అఫ్ విశాఖపట్నం అధ్యక్షులు జీజ వాల్సరాజ్, ప్రముఖ న్యూట్రిషన్ ఉషా రాజు మాట్లాడారు. గిన్నిస్ రికార్డ్ సాధించిన టీంను అభినందించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ మాట్లాడుతూ రికార్డు కోసం 1500 తయారు చేయాల్సి ఉండగా 2719 పోంచోస్ తయారు చేసి సరికొత్త రికార్డ్‌ను సంస్థ ప్రతినిధులు నెలకొల్పారన్నారు. గత ఏడాది రికార్డ్ కూడా మహిళా మనోవికాస్ పేరిటే ఉందని తెలిపారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## 1 నుంచి ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో అక్టోబర్ 1, 2, 3 తేదీలలో ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఆహద్ అష్రఫ్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్‌నకు సినీ దర్శకులు కళింగ రాజు, ఎల్లాజీ టీచర్లుగా వ్యవహరిస్తారన్నారు. డైరెక్షన్‌లో ఉన్నటువంటి అన్ని ప్రాథమిక అంశాలపై క్లుప్తంగా వివరిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ మాట్లాడుతూ వర్క్‌షాప్ చివరి రోజు హాజరైన వారిని బృందాలుగా విభజించి జీరో బడ్జెట్ షార్ట్ ఫిల్మ్ నిర్మించడం, అక్కడే ఎడిటింగ్, రిలీజింగ్ వంటి పనులు చేపడతామన్నారు. ఉత్తమ చిత్రానికి అవార్డు ఇస్తామని వెల్లడించారు. నగరంలో ఉన్నటువంటి ఔత్సాహిక కళాకారులంతా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని కోరారు. ట్రెజరర్ కుమార్ రాజు మాట్లాడుతూ హాజరయ్యేవారు ఈ నెల 22వ తేదీలోపు రూ.500ను ప్రవేశ రుసుముగా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8919347875, 7569040211, 9642707036, 9490098794 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు దిలీప్ కుమార్, చిన్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

## 16 నుంచి సమ్మెకు సిద్ధంకండి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జివిఎంసి నీటి సరఫరా, యుజిడి, పారిశుధ్యం, మలేరియా, వెటర్నరీ, పార్కులు మొదలగు అన్ని విభాగాల కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తామని అంగీకరించి, మినిట్స్‌లో నమోదు చేసి మాటతప్పిన అధికారుల చర్యలను ఖండిస్తూ కార్మికులంతా ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సమ్మె సన్నాహక చర్యల్లో భాగంగా ఆదివారం నల్లబెల్లి రైవాడ కెనాల్ కార్మికులు, కృష్ణనాయుడుపేట కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టర్న్‌కాక్, ఎలక్ట్రికల్ హెల్పర్స్, ఫిట్టర్ హెల్పర్స్, రైవాడ కెనాల్ కార్మికులు, గార్డినర్లకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించడానికి అంగీకరించి అధికారులు మాట తప్పారన్నారు. రిటైరైన, చనిపోయిన కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తానన్నటువంటి హామీని కూడా మరిచారని తెలిపారు.